సాక్షి వరంగల్

గురువారం । 10 । ఆగస్టు । 2023



డిగ్రీ.. నో డిమాండ్

కేయూ పరిధిలో వివిధ రకాల డిగ్రీ కోర్సులు ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం డిగ్రీ మొదటి సంవత్సరంలో 35శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. - 8లో▸



స్కూల్ బస్సును ఢీకొన్న జెడ్పీఫ్లోర్ లీడర్ వాహనం - 8లో▸

ఆగి ఉన్న స్కూల్ బస్సును జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న వాహనం ఢీకొని ఏడుగురు విద్యార్థులు గాయపడ్డారు.

గరిష్టం/కనిష్టం
$34^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌ఎఫ్‌ఐ



నల్లబెల్లి: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చుక్క ప్రశాంత్, యార ప్రశాంత్ అన్నారు. విద్యారంగ సమస్యలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం నారక్కపేట, రుద్రగూడెం, నల్లబెల్లి గ్రామాలకు చేరింది. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. శివరాత్రి అనిల్, సాయిరాం, అక్షిత, రాకేష్, ప్రశాంత్, శ్రుతి, జ్యోతి, వినోద్, కల్యాణ్, గౌస్‌పాషా, సమీర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను త్వరితగతిన నాటాలి



పర్వతగిరి: హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలకు నిర్దేశించిన మొక్కలను త్వరితగతిన నాటాలని అడిషనల్ డీఆర్‌డీఓ వసుమతి సూచించారు. ఈ మేరకు ఎంపీడీఓ పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకం కోసం ప్రతి గ్రామ పంచాయతీలో లబ్ధిదారులను గుర్తించాలని అన్నారు. ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్, ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీఓ సుశీల్‌కుమార్, ఈసీ రాజు, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

గడ్డి మందు పిచికారీ చేయొద్దు : డీపీఓ



గీసుకొండ: గ్రామాల్లో హరితహారం మొక్కల వద్ద కలుపు నివారణ కోసం గడ్డి మందును పిచికారీ చేయొద్దని, గ్రాస్ కట్టింగ్ యంత్రాలను కొనుగోలు చేయాలని డీపీఓ కటకం కల్పన సూచించారు. బుధవారం మచ్చాపూర్ గ్రామాన్ని ఆమె సందర్శించారు. పల్లె ప్రకృతివనం, డంపింగ్‌యార్డు, వైకుంఠధామం, పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. హరితహారం కింద మొక్కలను అధికంగా నాటాలని ఆమె సూచించారు. డీఎల్పీఓ కీర్తి ప్రభాకర్, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి శారద పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



విద్యారణ్యపురి: తొమ్మిదేళ్లుగా టీచర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయసంఘం (టీపీయూఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ అన్నారు. బుధవారం ఆ సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల ఆధ్వర్యంలో హనుమకొండలోని ఏబీవీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు.

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

కరీమాబాద్ : కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట ట్యాబ్స్, బతుకమ్మలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్బీసీ, వీఆర్‌ఏ, సెర్ప్, కాంట్రాక్టు అధ్యాపకుల తరహాలోనే సెకండ్ ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలని కోరారు. రెగ్యులర్ చేయకపోతే ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. చెన్నకేశవులు, గోవర్ధనాచారి, ఏఎన్‌ఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, రజిత, సౌమ్య, స్రవంతి, ప్రసన్న, కవిత, దేవయాని, జ్యోతి, అనురాధ, మాధవి, సౌజన్య పాల్గొన్నారు.

అసైన్డ్ ల్యాండ్‌లో ఇసుక దందా!

వర్ధన్నపేట, కొత్తపల్లి, ఇల్లంద, ల్యాబర్తిలో వ్యాపారం

- ఆకేరు వాగు నుంచి రోజుకు 500 ట్రాక్టర్లలో రవాణా
- ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో నష్టం
- పట్టించుకోని పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు



కొత్తపల్లి ఆకేరువాగు సమీపంలో ఇసుక ట్రాక్టర్లు, జేసీబీ

సాక్షి, వరంగల్ : ఇసుకాసురులు తగ్గేదేలే అంటున్నారు. రోడ్లపైకి రోజూ వందల ట్రాక్టర్ల ఇసుకను తరలిస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో మరింత పెట్రేగిపోతున్నారు. రూ.కోట్లలో దందా జరుగుతోందని తెలిసినా రెవెన్యూ, మైనింగ్ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. అసైన్డ్ భూముల్లో ఇసుక తవ్వుతున్నారనే కథనాలు వెలుగులోకి వచ్చినా అటువైపు కన్నెత్తికూడా చూడడం లేదు. ఇదంతా బాబు కనుసన్నల్లోనే జరుగుతుండడంతో వీరి వ్యాపారం మూడు పూలు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఆయనకు తోడుగా మరొకరు 'గిరి'గీసి అందరిని సమన్వయం చేస్తుండడంతో కాసులు కురిపిస్తున్నాయి. కొందరికి రూ.కోట్లు వస్తుండగా ప్రభుత్వ ఖజానాకు మాత్రం భారీగా గండిపడుతోందన్న విమర్శలున్నాయి.

రోజుకు రూ.రెండు కోట్ల వ్యాపారం..

వర్ధన్నపేట, కొత్తపల్లి, ఇల్లంద, ల్యాబర్తి గ్రామాల్లో ప్రవహిస్తున్న ఆకేరు వాగు చుట్టుపక్కలా ఉన్న అసైన్డ్ భూములు కొందరికి కాసులు కురిపిస్తున్నాయి. అవి ప్రభుత్వ భూములైనా కూడా వారు యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతూ ఇసుకను ట్రాక్టర్లలో లోడ్ చేసి తరలిస్తున్నారు. దాదాపు ఒక్క లోడ్‌ను రూ.నాలుగు వేలకుపైనే అమ్ముతున్నారు. సగటున రోజుకు 500 ట్రాక్టర్లు అనుకుంటే రూ.రెండు కోట్ల వ్యాపారం జరుగుతోందని స్థానికంగా చర్చ జరుగుతోంది. మైనింగ్, రెవెన్యూ అనుమతి లేకుండానే ప్రభుత్వ భూముల నుంచి టన్నుల కొద్ది ఇసుక తోడుతుండడంతో రూ.కోట్లలో ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతోందని చర్చించుకుంటున్నారు. నిరంతరం ఇసుకను తవ్వడం వల్ల వాగులో మట్టి ఏర్పడి భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉంది. ఇది పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయంపై ప్రభావం చూపే అవకాశం ఉందని కూడా స్థానికులు చర్చించుకుంటున్నారు.

ట్రాక్టర్లు వెళ్లేందుకు వేలం..

కొత్తపల్లి గ్రామ ఆకేరు వాగు సమీపంలో ఇసుక ట్రాక్టర్లు వెళ్లే మార్గంలో ఉన్న పొలాల యజమానులు మాత్రం రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. కొందరు రైతులకు చెందిన భూముల నుంచి ట్రాక్టర్లు వెళ్లడానికి సంవత్సరానికి వేలం పాడారు. దీన్ని సుమారు రూ.20 లక్షలకు దక్కించుకొని ఓ వ్యక్తి ఆయా ట్రాక్టర్ల నుంచి ట్రిప్పులకు రూ.200కుపైగా వసూలు చేస్తున్నట్లు ప్రచారం ఉంది. వందల ఇసుక ట్రాక్టర్లు వెళ్తుండడంతో వీరికి కూడా భారీగా ఆదాయం సమకూరుతోంది. ప్రభుత్వానికి వీటి నుంచి ఇసుమంతైనా ఆదాయం లేకపోవడానికి గల కారణం సంబంధిత ప్రభుత్వ శాఖలోని ఉద్యోగులే కారణమని పలువురు పేర్కొంటున్నారు. ఆమ్యామ్యాలకు ఆశపడి వీటిని పట్టించుకోకపోవడంతోనే ఈ ఇసుకాసురులు ఎవరిని లెక్కచేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి సారించి ఇసుక దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



బీమా చెక్కు అందిస్తున్న మంత్రి ఎర్రబెల్లి

రాయపర్తి: బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. కొత్తూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త అంబటి శ్రీనివాస్, వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన సుధగాని రమేష్ ఇటీవల మృతిచెందారు. పార్టీ నుంచి మంజూరైన బీమా చెక్కులను మృతుల కుటుంబాలకు మంత్రి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, జాజునాయక్, సర్పంచ్‌లు కందికట్ల స్వామి, గూబ ఎల్లయ్య, దొమ్మాటి సుభాష్, సుదగాని రంజిత్, మంద యాకూబ్‌రెడ్డి, సంకినేని ఎల్ల స్వామి, తాటికాయల భాస్కర్ పాల్గొన్నారు. అదేవిధంగా కొండూరులో మంత్రి బోనమెత్తుకుని ముత్యాలమ్మకు మొక్కులు చెల్లించారు.

ఎస్సారెస్పీ భూములకు హద్దులు నిర్ణయించాలి

- గుర్తించిన స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలి
- కలెక్టర్ పి.ప్రావీణ్య



సంగెం : తిమ్మాపూర్‌లో బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగెం: ఎస్సారెస్పీ కెనాల్‌కు ఇరువైపులా హద్దులు నిర్ణయించి, అనుకూలమైన భూముల్లో విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. మండలంలోని తీగరాజుపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో ఎస్సారెస్పీ కెనాల్ పక్కన గుర్తించిన భూమిలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం, దశాబ్ది సంపద వనం, తిమ్మాపూర్ గ్రామంలోని బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని బుధవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సారెస్పీ కెనాల్ వెంట ఆక్రమణకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుని కమ్యూనిటీ, లీనియర్, బ్లాక్ ప్లాంటేషన్ చేయాలని ఆదేశించారు. ఈ సారి వందశాతం అవెన్యూ ప్లాంటేషన్ పూర్తి చేసి, ఎప్పటికప్పుడు నీళ్లు పోస్తూ నాటిన మొక్కలు బతికేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. భారత స్వాతంత్ర వజ్రోత్సవాల సందర్భంగా తీగరాజుపల్లిలో మొక్కలు నాటడానికి ఎస్సారెస్పీ కెనాల్ పక్కన గల భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, డీఆర్‌డీఓ సంపత్‌రావు, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, మండల పంచాయతీ అధికారి కొమురయ్య, ఎస్సారెస్పీ ఏఈ వేణుగోపాల్, ఏపీఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కెనాల్ కట్టపై గుడిసెలు తొలగించాలి

గీసుకొండ: కొనాయమాకులలోని ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వ కట్టపై వెలిసిన గుడిసెలను తొలగించి, పల్లె ప్రకృతి వనాన్ని పెంచాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం సంగెం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం కొనాయమాకుల, వంచనగిరి గ్రామాలను ఆమె సందర్శించారు. కొనాయమాకుల కాకతీయ కెనాల్ వద్ద ఆమె మొక్కలను నాటారు. కెనాల్ మొత్తం విస్తీర్ణంలో లీనియర్, బ్లాక్ ప్లాంటేషన్ చేయాలన్నారు. జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, డీఆర్‌డీఓ సంపత్‌రావు, తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్, ఎంపీడీఓ వీరేశం, ఏపీఓ చంద్రకాంత్, ఎంపీఓ ప్రభాకర్, సర్పంచ్ డోలె రాధాబాయి, చిన్ని, ఐబీ ఏఈ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నూనె వేణుప్రసాద్ పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన సీపీ



వర్ధన్నపేట: వాహన పత్రాలను పరిశీలిస్తున్న సీపీ రంగనాథ్, క్రైం డీసీపీ మురళీధర్

వర్ధన్నపేట/పర్వతగిరి: వర్ధన్నపేట పట్టణ పరిధిలోని డీసీతండా శివారు బావనికుంట, పర్వతగిరి మండలం అనంతారం క్రాస్‌రోడ్డు వద్ద వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ బుధవారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, ఇంజన్ చాసిస్ నంబర్లు సరిగా ఉన్నాయా అని పరిశీలించారు. ఆయన వెంట క్రైం డీసీపీ మురళీధర్, పర్వతగిరి సీఐ శ్రీనివాస్, వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్‌డీఏ ఏపీడీ గొట్టె శ్రీనివాస్



పిండి గిర్నిని ప్రారంభిస్తున్న గొట్టె శ్రీనివాస్

వర్ధన్నపేట: బ్యాంకులు అందిస్తున్న సబ్సిడీ రుణాలను స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామైక్య సంఘాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ ఏపీడీ గొట్టె శ్రీనివాస్ సూచించారు. ఇల్లంద గ్రామంలో తుంగభద్ర వీఓలోని వెన్నెల మహిళా సంఘం సభ్యురాలు వేముల స్వరూప ఏపీజీవీబీ ఇల్లంద శాఖ ఆర్థిక సహకారంతో పీఎంఎఫ్‌ఎంఈ (ఫుడ్ ప్రాసెసింగ్) పథకం ద్వారా రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పిండి గిర్నిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకుల ద్వారా అందిస్తున్న వివిధ రకాల రుణాలతో వ్యాపార, వాణిజ్య రంగాల్లో రాణించాలన్నారు. పీఎం ఎఫ్‌ఎంఈ పీఎం ఈజీపీ పథకాల ద్వారా 35 శాతం రాయితీ రుణాలు అందించనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ మేనేజర్ శ్రీనివాస్, డీపీఎం సరిత, ఫీల్డ్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ గోలి కొమురయ్య, వీఓ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ, జనగాం మౌనిక, వీఓఏలు కత్తి స్రవంతి, రమ్య, ఆకుల స్రవంతి, శోభ, పద్మ పాల్గొన్నారు.

తపాలా శాఖలో మువ్వన్నెల పతాకం

- అమ్మకాలు చేపట్టిన అధికారులు
- రూ.25కే 20X30 సైజ్ జాతీయ జెండాలు

ఖిలా వరంగల్/కరీమాబాద్: వరంగల్, హనుమకొండ డివిజన్ తపాలా శాఖ కార్యాలయాలు జాతీయ పతాక విక్రయ కేంద్రాలుగా మారాయి. గతేడాది వజ్రోత్సవాల్లో భాగంగా అన్ని తపాలా శాఖ కార్యాలయాల్లో జాతీయ జెండాల విక్రయాలు మొదలెట్టింది.

మంచి ఆదరణ లభించడంతో ఈ ఏడాది కూడా హర్ ఘర్ తిరంగా-2 పేరుతో జాతీయ జెండాల అమ్మకాలకు ప్రణాళికలు సిద్ధం చేసింది. గత ఏడాది జాతీయ జెండాలను పోస్టాఫీసుల్లోకి వచ్చి తీసుకెళ్లాల్సి ఉండేది. ఈ ఏడాది ఎలాంటి అదనపు రుసుము లేకుండా రూ.25కే ఆన్‌లైన్ అమ్మకాలను చేపట్టింది. dowarangal.ap@ indiapost.gov.in వెబ్‌సైట్‌లో పేరు, ఇంటి చిరునామా వివరాలు నమోదు చేయాలి. బుకింగ్ చేసుకున్న ప్రతి ఒక్కరికి తపాలా సిబ్బంది ఇంటికి వచ్చి నేరుగా 20 X30 సైజ్ జాతీయ జెండాలు ఇస్తారు.



వరంగల్ డివిజన్, హెడ్‌పోస్టాఫీసులో జెండా విక్రయాలను ప్రారంభిస్తున్న ఆ శాఖ అధికారులు



జాతీయ జెండా విక్రయాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, తపాలా శాఖ అధికారులు

కలెక్టర్‌కు జెండా అందజేత

వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను బుధవారం తపాలా శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా సూపరింటెండెంట్ నర్సింహస్వామి మర్యాద పూర్వకంగా కలిసి జాతీయ జెండాను అందించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా 2.0 కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిమీద జాతీయ జెండా ఎగురవేయాలన్న నినాదంతో తపాలా శాఖ ఆధ్వర్యంలో విక్రయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ సౌత్ సబ్ డివిజన్ సహాయ పర్యవేక్షకుడు సుమన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాగులపై బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు

- రూ.40.63 కోట్లు మంజూరు చేస్తూ జీఓ 20 విడుదల
- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- 90 మంది పోడు రైతులకు పట్టాల పంపిణీ



పోడు రైతులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

నర్సంపేట: నియోజకవర్గంలోని పలు వాగులపై చెక్‌డ్యాంలతోపాటు బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో నెక్కొండ, చెన్నారావుపేట, ఖానాపురం మండలాల నాయకులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నెక్కొండ మండలం నాగారం, బొల్లికొండ, సూరిపల్లి గ్రామాలకు చెందిన 90 మంది పోడు రైతులకు పట్టాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.40.63 కోట్లకు సంబంధించిన జీఓ 20ని ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని మున్నేరువాగుపై రూ.18.78 కోట్లతో చెక్‌డ్యాం, రోడ్డు బ్రిడ్జి నిర్మాణం, నెక్కొండ మండలం నాగారం గ్రామంలో వట్టివాగుపై రూ.18.60 కోట్లతో చెక్‌డ్యాం, రోడ్డు బ్రిడ్జి, నెక్కొండ మండలం చిన్నకొర్పోలులో వట్టివాగుపై రూ.3.25 కోట్లతో చెక్‌డ్యాం మంజూరైనట్లు తెలిపారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండు మండలాల ప్రజల దశాబ్దాల కలను ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా నెరవేర్చినట్లు ఎమ్మెల్యే వివరించారు.

11న జాతీయ విద్యావిధానంపై ఉపన్యాసం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని విద్యావిభాగం, పీవీ విజ్ఞానపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11న జాతీయ విద్యావిధానంపై ఉపన్యాసం ఏర్పాటు చేసినట్లు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ- 2020 ఇన్ ది కాంటెక్టస్ ఆఫ్ ఫెడరల్ స్పిరిట్'అంశంపై ఉపన్యాసం ఉంటుందని పేర్కొన్నారు.

కేయూ దూరవిద్య డిగ్రీ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. చాలామంది విద్యార్థులు నేరుగా దూరవిద్య కేంద్రానికి చేరుకుని ఫైన్‌తో పరీక్ష ఫీజు చెల్లించి హాల్‌టికెట్లు పొందారు. తొలిరోజు డిగ్రీ కోర్సుల ఫైనలియర్ పరీక్షలు మొత్తంగా 13 కేంద్రాల్లో జరిగాయి. డిగ్రీ సెకండియర్ గురువారం నుంచి, మొదటి సంవత్సరం పరీక్షలు 11న ప్రారంభం కానున్నాయి.

అర్థమయ్యే రీతిలో బోధించాలి

- తొలిమెట్టు శిక్షణ కార్యక్రమంలో డీఈఓ వాసంతి



ఖానాపురం : మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

ఖానాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని డీఈఓ వాసంతి సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలో జరుగుతున్న తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా తొలిమెట్టులో శిక్షణ విధానాన్ని వివరించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తొలిమెట్టు శిక్షణలో నేర్చుకున్న అంశాల ద్వారా విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అనుగుణంగా బోధన చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే మెరుగైన విద్యాబోధన చేయడం ద్వారా భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

దుగ్గొండి : మండల కేంద్రంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా సెక్టోరియల్ అధికారి సుధీర్‌బాబు మాట్లాడారు. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు శిక్షణ తరగతులు దోహదపడుతాయని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు తరగతి గదుల్లో విద్యార్థులకు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు ప్రవీణ్‌కుమార్, దుర్గాప్రసాద్, రిసోర్స్ పర్సన్లు శ్రీనివాస్, సుల్తానాబేగం, నర్సింహులు, కైలాసం, రామ్మోహన్, నవీన్ పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

- కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ బృందం సూచన
- ఖానాపురం పీహెచ్‌సీ, బుధరావుపేటలో పరిశీలన



ఖానాపురం : మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

ఖానాపురం: గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాస్, జిల్లా కీటక జనిత వ్యాధి నివారణ ప్రోగ్రాం ఆఫీసర్ చల్లా మధుసూదన్ సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, డెంగీ పాజిటివ్ కేసులు వచ్చిన బుధరావుపేటను పరిశీలించారు. నీటి నిల్వ ద్వారా వచ్చే వ్యాధులు, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలు, డ్రై డే కార్యక్రమాలను వైద్య సిబ్బంది తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ వ్యాధి ప్రభావిత ప్రాంతాలను ముందే గుర్తించి యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టాలని సూచించారు. కేంద్ర బృందం సభ్యుల్లో కన్సల్టెంట్ లక్ష్మణ్, టెక్నీషియన్ హరినాథ్‌తోపాటు ఖానాపురం వైద్యాధికారులు భూపేష్, సబ్ యూనిట్ ఆఫీసర్ నంద, హెల్త్ సూపర్‌వైజర్లు సదానందం, రామలింగయ్య, చక్రపాణి, భాస్కర్, రాంప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నల్లబెల్లి: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కీటక జనిత వ్యాధుల నివారణ జిల్లా ప్రోగ్రాం అధికారి చల్లా మధుసూదన్ సూచించారు. మేడపల్లి పీహెచ్‌సీతోపాటు గోవిందాపూర్ సబ్ సెంటర్‌ను కేంద్ర బృందం సభ్యులు, జిల్లా అధికారులు తనిఖీ చేశారు. మేడపల్లి వైద్యాధికారి శశికుమార్, టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాస్, కన్సల్టెంట్ లక్ష్మణ్, టెక్నీషియన్ హరినాథ్ పాల్గొన్నారు.

ఆదివాసీల సంక్షేమానికి కృషి



పెద్దతండాలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి స్వర్ణ

పర్వతగిరి: బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఈ మేరకు మండలంలోని పెద్దతండాలో బుధవారం ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ ముఖ్య మాట్లాడుతూ ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, మండల నాయకులు సునీల్‌రావు, సూరయ్య, రాంచందర్, పూర్ణచందర్, బిక్షపతి పాల్గొన్నారు. అదేవిధంగా గడ్డపారతండాలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, మాజీ ఐపీఎస్ కేఆర్.నాగరాజు పల్లె నిద్ర చేశారు.

క్లుప్తంగా

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి



మాట్లాడుతున్న శ్రీకాంతారావు

హన్మకొండ కల్చరల్ : దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, ఆ భూములను నిబంధనల మేరకు కౌలుకు ఇచ్చి వచ్చిన ఆదాయం బ్యాంక్‌లో జమచేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీకాంతారావు ఆదేశించారు. బుధవారం పాత సెంట్రల్ జైల్ ఎదుట గల దేవాదాయ శాఖ (ధార్మిక భవన్) కార్యాలయంలో ధూప దీపనైవేద్య పథకం ద్వారా లబ్ధిపొందుతున్న అర్చకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 200మంది అర్చకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంతారావు.. అర్చకులు, దేవాదాయశాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. దేవాలయంలో సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, పర్యవేక్షకులు వీరస్వామి, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ.. నో డిమాండ్

కేయూ డిగ్రీ కళాశాలల్లో సగం కూడా భర్తీ కాని సీట్లు

- 287 కళాశాలల్లో మొత్తం 98,980 సీట్లు
- 34,959 సీట్లు మాత్రమే భర్తీ.. 64,021 ఖాళీ
- ఇక స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియ షురూ



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ, కంప్యూటర్ కాంబినేషన్‌లతో పాటు వివిధ రకాల కోర్సులు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో 2023–2024లో ఆయా డిగ్రీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు గాను ఇప్పటి వరకు మూడు దశల్లో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) ద్వారా సీట్లు కేటాయింపులు జరిగాయి. యూనివర్సిటీ పరిధిలో ఉన్న సీట్లల్లో సగం కూడా భర్తీకాలేదు. కేవలం 35శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. యూనివర్సిటీ పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, అటానమస్ డిగ్రీ కళాశాలలు కలిపి 267 ఉన్నాయి. అందులో వివిధ డిగ్రీ కోర్సులన్నీ కలిపి మొత్తం 98,980 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది మే నుంచి జూలై వరకు మూడు దశల్లో అడ్మిషన్ల ప్రక్రియ జరిగింది. మొదటి దశలో కేయూ పరిధిలోని కళాశాలలకు 16,078 సీట్లు కేటాయించగా అందులో 10,678 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆ తరువాత జరిగిన రెండోదశలో 11,112 సీట్లు కేటాయించగా 8,342 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆ తరువాత మూడోదశలో 18,076 సీట్లు కేటాయించగా 15,939 మంది విద్యార్థులు కళాశాలల్లో చేరారు. మూడు దశల్లో నిర్వహించిన డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియలో మొత్తం 45,266 సీట్లు కేటాయించగా 34,959 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. కేవలం 35శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇంకా 64,021 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

స్పెషల్ ఫేజ్‌కు అడ్మిషన్ల ప్రక్రియ షురూ..

రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలకుగాను మూడు దశలు ముగిసినా వివిధ యూనివర్సిటీల పరిధిలో సీట్లు చాలా మిగిలాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి దోస్త్ ద్వారా స్పెషల్ ఫేజ్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియకు షెడ్యూల్ జారీ చేసింది. ఈ నెల 7వతేదీ నుంచి స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియ షురూ అయింది. ఈ నెల 13వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. సోమవారం నుంచి ఈనెల 14వ తేదీవరకు వెబ్ ఆప్షన్‌లు ఇచ్చుకోవాలి. ఈనెల 17న సీట్లు కేటాయింపు జరగనుంది. స్పెషల్ ఫేజ్ నిర్వహించినా కూడా సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అయ్యే పరిస్థితి కనపడడంలేదు. ఇంటర్ పూర్తికాగానే ఎక్కువశాతం మంది విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులతోపాటు దూర ప్రాంతాల రాష్ట్రాలకు తరలివెళ్తున్నారు. దీంతో సంప్రదాయ డిగ్రీ కోర్సులకు ఆదరణ తగ్గిపోతుంది. డిగ్రీలో కూడా పలు కొత్త కోర్సులు ప్రవేశపెట్టినప్పటికీ వాటికి కూడా ఆదరణ అంతగా ఉండడం లేదనే సీట్ల భర్తీని బట్టి తెలుస్తోంది. మరోవైపు డిగ్రీలోనూ గురుకులాల సంఖ్య పెంపుదల చేశారు. దీంతో గురుకులాల్లో చేరడంతో ఆ ప్రభావం కూడా ఇతర కళాశాలపై పడిందని భావిస్తున్నారు. మరోవైపు గత విద్యాసంవత్సరంలో విద్యార్థులు అసలే లేని కళాశాలలకు ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దోస్త్‌లో కొన్నింటికి అవకాశం ఇవ్వలేదు. మరి కొన్నింటికి ఇచ్చారు. ఫలితంగా ఆయా కళాశాలల్లో సీట్లు భర్తీ ఈ విద్యాసంవత్సరంలోనూ అంతంత మాత్రమేనని సమాచారం.

మూడుదశల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో కేయూ పరిధిలో గత నెల 27నుంచే క్లాస్‌లు ప్రారంభమయ్యాయి. స్పెషల్‌ఫేజ్ అడ్మిషన్లకు అవకాశం ఇచ్చినా అంతంతమాత్రమే సీట్లు భర్తీ అయ్యే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షం



బోనం ఎత్తుకున్న మంత్రి దయాకర్‌రావు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలో జరిగిన బోనాల వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. బోనం ఎత్తుకుని మహిళలతో కలిసి ముత్యాలమ్మ గుడిలో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించి నిరుద్యోగ యువతను మోసగించిందన్నారు. సీఎం కేసీఆర్ హామీ ప్రకారం 1.33 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశారని, 80 వేలకు పైగా ఖాళీలకు నోటిఫికేషన్లు ఇచ్చారని గుర్తు చేశారు. రూ.152 కోట్లతో తొర్రూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేయనున్నామన్నారు. సంక్షేమ పాలనతో ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, పట్టణాభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పానుగోటి సోమేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాసరావు, దొంగరి రేవతి, నాయకులు కుర్ర శ్రీనివాస్, దొంగరి శంకర్, కర్నె నాగరాజు, జైసింగ్, పూలమ్మ పాల్గొన్నారు.

కేయూలో ఎస్ఎఫ్‌సీ విద్యార్థుల ధర్నా

- రెండోరోజూ కొనసాగింపు
- హాస్టల్ వసతి కల్పిస్తామని ప్రిన్సిపాల్, డైరెక్టర్ హామీ
- ఆందోళన విరమణ



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎస్ఎఫ్‌సీల విద్యార్థులు తమకు హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ రెండోరోజు కూడా బుధవారం ఉదయం 6 గంటల నుంచే గేట్ మూసివేసి ధర్నా చేశారు. మొదటి గేట్ మూసివేతతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దీనిపై సమాచారం అందుకున్న యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి సురేష్ లాల్, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య వై వెంకయ్య మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఘటనా స్థలికి చేరుకున్నారు. వెంకయ్య మాట్లాడుతూ గత విద్యాసంవత్సరంలో ఏ ఎస్ఎఫ్‌సీకి సంబంధించిన విద్యార్థులకు కూడా హాస్టల్ వసతి కల్పించలేదన్నారు. అయినా కొందరు నాన్‌బోర్డర్లుగా ఉండడం సరికాదన్నారు. అన్ని ఎస్ఎఫ్‌సీల విద్యార్థులకు మరో 15 రోజుల్లో హాస్టల్ వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కాగా, ఆందోళనకు ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్, బి రాకేష్ (ఎస్ఎస్‌యూఐ), మహేష్(పీడీఎస్‌యూ) తదితరులు మద్దతు తెలిపారు.

పసుపు ధర పైపైకి..

- కేసముద్రం మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.13,221
- వరంగల్‌లో రూ.13వేలు..



కేసముద్రం మార్కెట్‌కు వచ్చిన పసుపు

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపుకు రికార్డుస్థాయిలో రూ.13,221 ధర పలికింది. మార్కెట్‌లో పసుపు సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.5 నుంచి 6వేల వరకు పలుకగా, నెల రోజుల నుంచి ధర క్రమక్రమంగా పెరుగుతూవస్తోంది. ఈ మేరకు బుధవారం మార్కెట్‌కు 56 బస్తాల పసుపు అమ్మకానికి రాగా, కాడిరకం పసుపుకు గరిష్ట ధర రూ.13,221, కనిష్ట ధర రూ.8,651 పలుకగా, గోళారకం పసుపుకు క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.11,752, కనిష్ట ధర రూ.6,509 పలికినట్లు మార్కెట్ అధికారులు పేర్కొన్నారు. కాగా, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏనుమాముల మార్కెట్‌లో రూ.13వేలు

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపు అత్యధికంగా క్వింటాల్‌కు రూ.13వేల ధర పలికింది. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన నూనె రాజయ్య మార్కెట్‌కు 20 బస్తాల పసుపు తీసుకొచ్చారు. పసుపు కాడి రకానికి క్వింటాల్‌కు రూ.13వేలు, గోళా రకానికి రూ.12600 పలకిందని యార్డు ఇన్‌చార్జ్ సాగర్ తెలిపారు. ఈ పసుపును జెకె.ఎంటర్‌ప్రైజెస్ నుంచి ఓసాయి ట్రేడర్స్ కొనుగోలు చేసినట్లు తెలిపారు.

అవార్డు సాధనకు పోటీ పడాలి

- టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత
- 28 మంది ఉద్యోగులకు ప్రగతి చక్రాల పురస్కారం



ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు అందజేసి సన్మానిస్తున్న ఆర్‌ఎం శ్రీలత

హన్మకొండ: అవార్డు సాధనకు ఉద్యోగులు పోటీ పడాలని టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత అన్నారు. బుధవారం హనుమకొండలోని వరంగల్–1 డిపోలో వరంగల్ రీజియన్ స్థాయి ప్రగతి చక్రాల పురస్కార ప్రదానోత్సవం జరిగింది. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన 28 మంది ఉద్యోగులకు ఆర్‌ఎం శ్రీలత నగదు అవార్డుతో పాటు ప్రశంస పత్రాలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపో, రీజియన్ స్థాయిలో కాకుండా రాష్ట్ర స్థాయి అవార్డు సాధించడంపై ఉద్యోగులు దృష్టి సారించాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఉద్యోగులు సంతోషంగా ఉన్నారన్నారు. అయితే ప్రభుత్వంలో విలీనంతో ఉద్యోగులపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. వరంగల్ రీజియన్ లాభాల్లో నడిచేలా అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కృపాకర్ రెడ్డి, మాధవరావు, ఈఈ భాస్కర్, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న ఉద్యోగుల వివరాలు...

వరంగల్–1 డిపో డ్రైవర్లు ఎ.రాజేందర్, టి.జె.సింగ్, కె.శ్యామ్, ఎం.శ్రీను, కె.వీరయ్య, భూపాలపల్లి డిపో డ్రైవర్లు కె.రాజేందర్, డి.కోటయ్య, పరకాల డిపో డ్రైవర్ టి.భిక్షపతి, వరంగల్–2 డ్రైవర్లు బి.పోచయ్య, ఎ.వెంకటయ్య, వరంగల్–2 డిపో కండక్టర్ బి.ఎస్.రావు, భూపాలపల్లి కండక్టర్ జి.సునీత, వరంగల్–1 డిపో కండక్టర్ జి.సుధాకర్, ఎస్.రమేష్, మహబూబాబాద్ కండక్టర్లు వీరన్న, వి,ఉమ, హనుమకొండ డిపో కండక్టర్లు ఎస్.రమేష్, ఎస్.కె.వై.పాషా, నర్సంపేట డిపో కండక్టర్లు బి.హరిసింగ్, బి.మహేందర్, టిమ్ డ్రైవర్లు కె.దినేష్‌కుమార్ (హనుమకొండ), టి.దేవేందర్ (హనుమకొండ), బి.సురేష్ (నర్సంపేట), ఎం.డి.షాహీద్ (నర్సంపేట), పి.ఆర్.రెడ్డి (నర్సంపేట), మెకానిక్‌లు టి.శంకరయ్య (వరంగల్–1), ఎం.సంజీవయ్య (వరంగల్–2), శ్రామిక్ ఎస్.సంపత్ కుమార్ (జనగామ) అవార్డులు అందుకున్నారు.

ఆయుర్వేద వైద్యకళాశాలలో అడ్మిషన్లకు అనుమతి

కాశిబుగ్గ: వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు అనుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ విజయగణేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్(ఎన్‌సీఐఎస్‌ఎం) షరతులతో కూడిన అనుమతి ఇచ్చిందన్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ప్రవేశాల కోసం ఎన్‌సీఐఎస్‌ఎం తనిఖీలకు సహకరించిన ఆస్పత్రి సూపరింటెండెంట్, సిబ్బంది, ఫ్యాకల్టీ మెంబర్లు, కళాశాల సిబ్బంది, రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ హరిచందనకు కృతజ్ఞతలు తెలిపారు.

వక్ఫ్ ఆస్తులు పరిరక్షించాలి



సెక్రటరీకి మొక్కను అందజేస్తున్న తన్వీర్

న్యూశాయంపేట: వరంగల్ జిల్లాలో వక్ఫ్ ఆస్తులు పరిరక్షించడానికి చర్యలు తీసుకుని ముస్లింల సమస్యలు పరిష్కరించాలని వరంగల్ వక్ఫ్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్, డెవలప్‌మెంట్ కమిటీ, ముస్లిం ప్రతినిధి బృందం కోరింది. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య నేతృత్వంలో హైదరాబాద్‌లో మైనారిటీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ ఉమర్ జలీల్‌ను కలిసింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ వరంగల్ ఫోర్ట్‌రోడ్‌లోని ఈద్గా అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ. కోటి 40 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధుల విడుదలకు వెంటనే అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, ఈద్గా కమిటీ బాధ్యులు ఎం.ఏ.ఖాలీక్‌తన్వీర్, సాధిక్ అలీ, ఎం.ఎం. తహశీర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఏకపక్ష నిర్ణయాలు చెల్లుబాటు కావు’

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్‌హాల్‌లో నిర్వహించిన అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) సర్వసభ్య సమావేశం చర్చలతోనే అర్ధాంతరంగా ముగిసిందని, ఏకపక్ష నిర్ణయాలు అకుట్ పరిధిలోనికి రావని అధ్యక్షుడు ఆచార్య తౌటం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి , ఉపాధ్యక్షురాలు ఆచార్య బ్రహ్మేశ్వరి, జాయింట్‌సెక్రటరీ కిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న జరిగిన అకుట్ సర్వసభ్య సమావేశంలో కొందరు అధ్యాపకులు నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకున్నారని, అవి చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. సమావేశంలో తీసుకునే నిర్ణయాలకు పూర్తి కోరం అవసరమన్నారు. అందుకే ఏకపక్ష నిర్ణయాలు చెల్లుబాటుకావన్నారు.

మృతదేహం వెలికితీసి పోస్టుమార్టం

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కలగడ్డ ఈద్గాలో బుధవారం ఉదయం గత నెల 12న పూడ్చి పెట్టిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం హనుమకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన షహనజ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమార్తె కాజోల్ (20)వీణాబజార్‌లో ఓ బట్టల షాపులో పనిచేస్తోంది. కాజోల్ అంబాల గ్రామానికి చెందిన అబ్బాస్‌తో ఆరు సంవత్సరాల నుంచి సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలో పెండ్లి విషయంలో కాజల్, అబ్బాస్‌కు గొడవలు జరిగాయి. ఇదిలా ఉండగా అనారోగ్య కారణాల రీత్యా గత నెల 12న కాజోల్‌ను ఎంజీఎంలో అడ్మిట్ చేయగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అదే రోజు రాత్రి అబ్బాస్ బొక్కలగడ్డ ఈద్గాలో కాజోల్ మృతదేహం పూడ్చిపెట్టాడు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి షహనజ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి హనుమకొండ తహసీల్దార్ సమక్షంలో కేఎంసీ ఫోరెన్సిక్ వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా నిందితుడిపై చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న ఒకరి మృతి

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ రెడ్డిపాలెం గ్రామానికి చెందిన తుపాకుల నూకాంబ్రం(60) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. నూకాంబ్రం మంగళవారం ఈత కొమ్మలు కోయడానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మొగిలిచర్ల బస్టాండ్ వద్ద వెనక నుంచి అతివేగంగా వచ్చిన కోళ్ల వ్యాన్.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన ఆయనను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



రంజిత్‌కుమార్ (ఫైల్)

రాయపర్తి: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరంగల్ చార్‌బౌళి ప్రాంతానికి చెందిన కాదర్ల రంజిత్‌కుమార్ (35) నగరంలో బంగారం షాపు నిర్వహించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం విరివిగా అప్పులు చేశాడు. తీర్చే మార్గం కనిపించక సోమవారం సాయంత్రం హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతంలో ఎస్సారెస్పీ కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహం కాల్వలో రాయపర్తి మండల కేంద్రంలోని గుబ్బడిబోడుకిందితండాకి కొట్టుకొచ్చింది. దీనిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని కాల్వ నుంచి బయటకు తీసి రంజిత్‌కుమార్‌గా గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం మృతదేహాన్ని నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య సుష్మిత, పాప, బాబు ఉన్నట్లు తెలిపారు.

స్కూల్‌బస్సును ఢీకొట్టిన జెడ్పీ ఫ్లోర్‌లీడర్ స్వప్న వాహనం

- ఏడుగురు విద్యార్థులకు తీవ్రగాయాలు.. ఒకరిని వరంగల్‌కు రెఫర్
- సకాలంలో రాని 108 వాహనం.. రోడ్డు వెంట వాహనాలు ఆపి తరలించిన స్థానికులు
- జెడ్పీ ఫ్లోర్‌లీడర్‌కు తీవ్రగాయాలు కావడంతో మరో వాహనంలో హనుమకొండకు తరలింపు



ప్రమాదానికి గురైన కారు, బస్సు..



తీవ్రంగా గాయపడిన మహేష్



ప్రమాదంలో గాయపడిన చిన్నారులు

నర్సంపేట రూరల్ : ఆగి ఉన్న స్కూల్ వ్యాన్‌ను వరంగల్ జిల్లా జెడ్పీ ఫ్లోర్ లీడర్, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ది స్వప్న వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. అందులో ఒకరిని మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌కు రెఫర్ చేశారు. ఈ ఘటన వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణ శివారులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణంలోని పాత్‌ఫైండర్ స్కూల్‌కు చెందిన ఇటుకాలపల్లి, నారక్కపేటకు రూట్ స్కూల్ బస్సు సాయంత్రం 5.20 గంటలకు 24 మంది పిల్లలతో బయలుదేరి వెళ్లింది. నారక్కపేట వైపు వెళ్లేందుకు 365 జాతీయ రహదారి వద్దకు చేరుకుంది. ముందు ద్విచక్రవాహనం ఉండడంతో డ్రైవర్ బస్సు నిలిపిఉంచారు. ఆ సమయంలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి వరంగల్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న ఫార్చ్యునర్ కారులో డ్రైవర్‌తో కలిసి ముత్తోజీపేట వైపు వేగంగా వస్తున్నాడు. ద్విచక్రవాహనాన్ని తప్పించపోయి కమలాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు వైపు తిప్పడంతో ఆ పక్కనే నిలిపివేసిన బస్సు వెనుకవైపు ఢీకొట్టారు. దీంతో బస్సు పల్టీ కొట్టే సమయంలో పక్కనే చెట్టు ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులోని 19మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. పెద్ది స్వప్నకు కూడా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. 108 వాహనం సకాలంలో రాకపోవడంతో జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను ఆపి విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి 11మంది తరలించగా ముగ్గురికి తీవ్రగాయాలైన అన్విత్, కీర్తనలను ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. నల్లబెల్లి మండలం నారక్కపేటకు చెందిన ఎం. మహేష్‌కు ప్రాథమిక చికిత్స నిర్వహించి వరంగల్‌కు రెఫర్ చేశారు. మరో 8మందిని నర్సంపేట పట్టణంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారిలో రిత్విక్, సహస్ర, నందు, దీక్షిత్‌లకు తీవ్రగాయాలు కాగా అడ్మిట్ చేశారు. మిగతావారికి చికిత్స అందించి తల్లిదండ్రులకు అప్పగించారు. నర్సంపేట ఏసీపీ తిరుమల్, టౌన్ సీఐ రవికుమార్, రూరల్ సీఐ కిషన్ ఆధ్వర్యంలో ప్రమాదంపై విచారణ జరుపుతున్నారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని విద్యార్థి సంఘాల నాయకులు పోలీసులను కోరారు.

హనుమకొండకు పెద్ది స్వప్న తరలింపు

ప్రమాదంలో గాయపడిన జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నను వెంటనే వేరే వాహనంలో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నట్లు సమాచారం.